సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



సమృద్ధిగా నీరు

గోదావరిలో సమృద్ధిగా నీటి లభ్యత ఉండటంతో రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో పంటలకు నీరందింది. దీంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. 8లో ▸



దొంగల హల్‌చల్

తుందుర్రులో దొంగలు హల్‌చల్ చేశారు. నలుగురు దొంగలు చోరీకి విఫల యత్నం చేయగా.. గ్రామస్తులు పట్టుకుని చెట్టుకు కట్టివేశారు. 8లో ▸



శ్రీనివాసా.. గోవిందా

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



భీమవరంలో రూమ్ నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు

భీమవరం: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జిల్లాలోని 22 కేంద్రాల్లో శనివారం పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్టు పరీక్షల నిర్వహణ జిల్లా కో–ఆర్డినేటర్ పి.ఫణీంద్రప్రసాద్ తెలిపారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురంలో కేంద్రాలు ఏర్పాటుచేయగా 7,347 మందికి 6,589 మంది హాజరయ్యారన్నారు. భీమవరంలో 2,132 మందికి 1,896 మంది, తణుకులో 2,741 మందికి 2,488 మంది, తాడేపల్లిగూడెంలో 1,371 మందికి 1,224 మంది, నరసాపురంలో 1,103 మందికి 981 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తంగా 4,366 మంది బాలురుకు 3,939 మంది, 2,981 మంది బాలికలకు 2,650 హాజరయ్యారని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు



భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువును వచ్చేనెల 1 వరకు పొడిగించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఏ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైనా వారు విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. వచ్చేనెల 6 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల్ రాజ్ సమక్షంలో పూర్తిచేశామని కలెక్టర్, సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం నియోజవర్గాల జనరల్ అబ్జర్వర్ ఎం.దీప తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ ఎల్.నిర్మల్‌రాజ్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, ఓపీఓల ర్యాండమైజేషన్‌ను పూర్తిచేశారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గూడూరి జగదీష్‌కుమార్, కామన నాగేశ్వరావు (వైఎస్సార్‌సీపీ), పాకా సత్యనారాయణ, కోమటి రవికుమార్ (బీజేపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), కాటూరి కరుణాకర్ (బీఎస్పీ), తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), జేఎస్వీ గోపాలన్ (సీపీఐ ఎం) పాల్గొన్నారు.

నిమ్మలకు హ్యాట్రిక్ గండం

సాక్షి, భీమవరం/ పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుని హ్యాట్రిక్ గండం వెంటాడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపికి లభిస్తున్న జనాదరణ, కూటమిలోని అసమ్మతి సెగలు, వరుసగా మూడోసారి పట్టం కట్టని పాలకొల్లు ప్రజల నాడి ఆయనకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ ఎన్నికల్లోనూ చరిత్రే పునరావృతమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

- పాలకొల్లులో రెండుసార్లే వరుస విజయాలు
- మూడోసారి పట్టం కట్టని నియోజకవర్గ ప్రజలు
- సీఎం జగన్ పాలనలో కనీవినీ ఎరుగని అభివృద్ధి
- రూ.475 కోట్లతో శరవేగంగా వైద్య కళాశాల పనులు
- రూ.కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపికి జనాదరణ
- కూటమిలో అసమ్మతి సెగలు
- ఎమ్మెల్యే రామానాయుడు వెన్నులో వణుకు



70 ఏళ్ల చరిత్ర

పాలకొల్లు శాసనసభ నియోజకవర్గానికి 70 ఏళ్ల చరిత్ర ఉంది. 1955 నుంచి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు జరిగాయి. 1983, 1985 అలాగే 1994, 1999 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు అల్లు వెంకటసత్యనారాయణ గెలుపొందారు. అయితే వరుసగా మూడోసారి పోటీచేసిన సందర్భంలో ప్రజలు ఆయన్ను ఓడించారు. తర్వాత 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు గెలుపొందుతూ వచ్చిన రామానాయుడు ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో ఉన్నారు. ఇప్పటివరకు ఏ అభ్యర్థికీ నియోజకవర్గంలో వరుసగా మూడోసారి ప్రజలు పట్టం కట్టడం పాలకొల్లు చరిత్రలో లేదు.

ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం

రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మల ప్రచార ఆర్భాటంలో తప్ప అభివృద్ధిలో తనదైన ముద్రను వేసుకోలేకపోయారు. చెప్పుకోదగిన స్థాయిలో ప్రజాసమస్యలను పరిష్కరించలేకపోయారు. అయితే సీఎం జగన్ పాలనలోని ఈ ఐదేళ్లలో కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ లబ్ధిని చేకూర్చడంతో పాటు అభివృద్ధి పనుల్లోనూ పాలకొల్లుకు అధిక ప్రాధాన్యమిచ్చారు. పాలకొల్లు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సుమారు రూ.1,440 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 6.84 లక్షల మంది లబ్ధిదారులకు రూ.619 కోట్ల లబ్ధి చేకూరింది.

ప్రజలతో గోపి మమేకం

ఓ పక్క ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి ప్రజలతో మమేకమవుతుంటే.. ఓటర్లను ఆకట్టుకునే విన్యాసాలే తప్ప చెప్పుకోవడానికి చేసిందేమీ లేదన్నట్టుగా నిమ్మల ప్రచారం సాగుతోందని సొంతగూటి నేతలే చెప్పుకుంటున్నారు. ఒక పక్క అధికార పక్షం జోరు, మరోపక్క పాలకొల్లు సెంటిమెంట్‌తో చరిత్ర పునరావృతమవుతుందని చెవులు కొరుక్కుంటున్నారు.

మెడి'కల' సాకారం

పాలకొల్లు మండలం దగ్గులూరులో రూ.475 కోట్ల వ్యయంతో 61 ఎకరాల విస్తీర్ణంలో వైద్య కళాశాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 150 మంది విద్యార్థులు కళాశాలలో ఎంబీబీఎస్ విద్యను అభ్యసించనున్నారు. వంద పడకల ఆస్పత్రికి నిధుల మంజూరు లేకుండానే గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే నిమ్మల ప్రజలను నమ్మించేందుకు బోగస్ శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు. కాగా సీఎం జగన్ పాలనలో రూ.16.60 కోట్ల వ్యయంతో 150 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టి పూర్తిచేయడం గమనార్హం. రూ.15 కోట్లతో పాలకొల్లులో తాగునీటి ఫిల్టర్ బెడ్ నిర్మించారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రచారాస్త్రంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

అసమ్మతి సెగలు

ఎమ్మెల్యే నిమ్మల వైఖరిపై కూటమి నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. స్వతహాగా కిందిస్థాయి కేడర్‌ను ఎదగనివ్వరని ఆయనకు పేరుంది. కూటమిలోని జనసేన, బీజేపీ నేతల విషయంలోను ఆదే వైఖరిని అవలంబిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. సాధారణంగా ఎన్నికల ప్రచారానికి అవసరమైన సామగ్రిని అభ్యర్థి సమకూరుస్తుంటారు. కాగా ప్రచారంలో పాల్గొనే కూటమి నాయకులను ఎవరి పార్టీ జెండాలు వారే తెచ్చుకోవాలని సూచిస్తుండటంతో పాటు ప్రచారం చేసే సమయంలో తనను దాటుకుని ఎవరూ ముందుకు వెళ్లకూడదని ఆయన చెబుతున్నారంట. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి బీజేపీ పోటీ చేస్తున్న నేపథ్యంలో వారు జెండా ఖర్చులు భరించుకుంటారని, మద్దతు తెలుపుతున్న తమపై ఖర్చులు రుద్దుతున్నారని జనసేన నాయకులు అంటున్నారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సరిగా చెప్పడం లేదని మండిపడుతున్నారు. నియోజకవర్గంలో పట్టున్న జనసేన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర చైర్మన్ బన్నీవాసు ప్రెస్‌మీట్లకే తప్ప ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల చంద్రబాబునాయుడు వచ్చిన సందర్భంలో బన్నీవాసును వేదికపైకి రాకుండా అడ్డుకోవడం పట్ల ఆయన మనస్తాపానికి గురై వెళ్లిపోవడంతో మరుసటిరోజు ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించి చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. ఆ అవమానభారంతో ఆయన ప్రచారానికి దూరంగా ఉంటున్నట్టు సమాచారం. బీజేపీ నేతలకు కూడా నిమ్మల వ్యవహారశైలి మింగుడు పడటం లేదు.

అక్రమ మద్యాన్ని నిరోధించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టరేట్ నుంచి ఆర్వోలతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): అక్రమ మద్యం పంపిణీ నిరోధించేందుకు నియోజవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గాల ఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం నిల్వలు, రవాణా, పంపిణీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదన్నారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు పటిష్టంగా తనిఖీలు చేయాలన్నారు. హోం ఓటింగ్ విషయంలో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. తెలుగు వర్ణమాల ప్రకారం అభ్యర్థుల పేర్లు క్రమంలో ఫారం–7ఏ రూపొందించాలన్నారు. ఇంటింటికీ ఓటర్ల స్లిప్పుల పంపిణీ ప్రారంభమైందని, జాగ్రత్తగా నిర్వహించాలని, రాజకీయ పార్టీలు, వలంటీర్ల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. పంపిణీ చేయగా మిగిలిన ఓటరు స్లిప్పులను సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అప్పగించాలన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే.. అనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి నూరు శాతం అమలు చేసిన ఏకైక పార్టీగా వైఎస్సార్‌సీపీ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. 2024 మేనిఫెస్టోలో గత పథకాలన్నింటినీ కొనసాగిస్తూ ఆర్థికసాయం మరింత పెంచి ప్రకటించారన్నారు. రైతు భరోసాను రూ.16 వేలకు, పింఛన్ కానుకను రూ.3,500కు, అమ్మఒడిని రూ.17 వేలకు పెంచారన్నారు. అలాగే వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాలన్నింటినీ కొనసాగిస్తూ మేనిఫెస్టో రూపొందించారన్నారు. రహదారులు, సాగునీటి రంగం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మేనిఫెస్టో ఉందని, మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.

హామీలు నూరు శాతం అమలు

ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారంటే నూటికి నూరు శాతం అమలు చేస్తారని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ప్రజలు, మహిళలు, రైతులకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. విద్య, వైద్యానికి పెద్దపెట్ట వేశారన్నారు. ఆచరణ సాధ్యమైనవే ప్రకటించారని.. చంద్రబాబు మాదిరి అమలు కాని హామీలు చెప్పలేదన్నారు. గతంలో చంద్రబాబు మహిళలు, రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేశారని గుర్తుచేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు అక్కున చేర్చుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

చెప్పారంటే.. చేస్తారంతే..

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



వీరవాసరం: జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేసిన గొప్ప నేత సీఎం జగన్ అని కొనియాడారు. ఈ మేనిఫెస్టోలో ప్రకటించిన 9 అంశాలు సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ముందుకు సాగేలా ఉందన్నారు. విద్యలో సంస్కరణలతో పాటు విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, అధ్యాపకులు, స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలు, ఉద్యోగాల కల్పన వంటి పలు మంచి నిర్ణయాలు ఉన్నారన్నారు. జిల్లా కేంద్రాల్లో మౌలిక వసతులకు ఏర్పాటు, ప్రతి జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెండింగ్ పూర్తికి ప్రాధాన్యమిచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలు మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిగా చూస్తారని, అన్ని స్థానాలూ గెలుచుకుంటామన్నారు.

మరింత ప్రకాశవంతంగా నవరత్నాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: నవరత్నాలు మరింత ప్రకాశవంతంగా వెలుగునిచ్చేలా సీఎం జగన్ మేనిఫెస్టోను రూపొందించారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మట్లాడుతూ ప్రజలకు సీఎం జగన్‌పై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మేనిఫెస్టో ఉందన్నారు. 58 నెలల కాలంలో అవినీతి, దళారులకు తావులేకుండా పథకాలను పారదర్శకంగా అందించారన్నారు. ప్రజలకు అమలు చేయగలిగేవి మాత్రమే సీఎం జగన్ మేనిఫెస్టోలో ప్రకటించారని స్పష్టం చేశారు. అమలు చేయలేని హామీలు ఇవ్వలేనని చెబుతూ గతంలో ఇచ్చిన సంక్షేమాన్ని పెంచుతూ మేనిఫెస్టోను రూపొందించిన వైనాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. మధ్యతరగతి వర్గాలకు సైతం సొంతింటి కల సాకారం చేసేలా తక్కువ ధరకు స్థలాన్ని అందచేస్తామని అన్నారు. గత మేనిఫెస్టోలో కాపునేస్తం పథకాన్ని ప్రకటించకపోయినా అమలు చేసి చూపించారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి అమలు చేయగలిగే హామీలు మాత్రమే ఇచ్చారని, చంద్రబాబులా మోసం, అబద్ధాలతో కూడిన మేనిఫెస్టోను మీ బిడ్డ జగన్ ఇవ్వరని అన్నారు. గతంలో చంద్రబాబు 650 హామీలిచ్చి ఎగ్గొట్టాడని, ఆన్‌లైన్‌లోంచి సైతం మేనిఫెస్టోను తొలగించారని గుర్తు చేశారు.

ట్రాఫిక్ పోలీసులకు రక్షణ కిట్లు

ఏలూరు టౌన్: ట్రాఫిక్ పోలీసులు అధికారులు, సిబ్బంది ప్రజలకు తమ సేవలు అందించేందుకు నిత్యం రోడ్లపైనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఏలూరు ట్రాఫిక్ సిబ్బందికి ఎండ వేడిమి, వడగాలుల నుంచి రక్షణకు సమ్మర్ కిట్లు అందజేశారు. శనివారం ఏలూరులో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చేతులమీదుగా ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సమ్మర్ కిట్లు అందజేశారు. తలకు హ్యాట్, కూలింగ్ వాటర్‌బాటిల్, బ్యాగ్, నల్లకళ్ల జోడును సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు రోజూ 8 గంటల పాటు ఎండలోనే రోడ్లపైనే విధులు నిర్వర్తిస్తూ ఉంటారనీ, ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు వాయు కాలుష్యంతో అనారోగ్యం పాలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, వాటి నుంచి రక్షణ కావాలని అన్నారు. గతేడాది ఇదేవిధంగా ట్రాఫిక్ సిబ్బందికి కిట్లు అందజేశామనీ, రెండో ఏడాది కూడా సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పంపిణీ చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లు అందిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిని ఆయన అభినందించారు.

చింతలపూడి ఆర్వోపై ఫిర్యాదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చింతలపూడి ఎన్నికల రిటర్నింగ్ అధికారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు రిటైర్డ్ ఎంఈఓ ఎస్.ధర్మదాసు శనివారం ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సుమారు 15 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన కుటుంబంతో నివాసం ఉంటూ, గ్రీన్‌కార్డ్ కలిగి ఉంటూ, ఫారం 6ఏ కింద ఓటరుగా నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకపోవడంతో పాటు అమెరికాలో బ్యాంకు ఖాతాలు, బీమా, ఆస్తులు, పన్నులు, రుణాలు, అమెరికాలోని చిరునామాను అఫిడవిట్‌లో మరుగుపరిచారని తెలిపారు. ఆయా విషయాలను వివరిస్తూ రోషన్‌కుమార్‌కు ముందుగానే లీగల్ నోటీసు పంపి అభ్యంతరాలను తెలియజేసినా ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి అంగీకరించడం చట్టవిరుద్ధమని తెలిపారు. సొంత విచారణ చేసి కూడా నామినేషన్‌ను తిరస్కరించాల్సి ఉండగా రిటర్నింగ్ అధికారి తన పదవిని దుర్వినియోగం చేసిన అంశంపై తక్షణ చర్యలు చేపట్టి, చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ధర్మదాసు తెలిపారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, తాను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ ఫైల్ చేస్తానని స్పష్టం చేశారు.

పాలన మెచ్చి.. సంక్షేమం వెంట నిలిచి..

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

అత్తిలి: సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలిలో శనివారం అత్తిలి గ్రామానికి చెందిన జనసేన నాయకులు శింగంపల్లి శ్రీను, బేపల పండు, జవ్వాది ప్రదీప్, బొర్రా రూపాకిరణ్, రెడ్డి గౌరీ (మాజీ ఎంపీపీ సోదరి) మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మొగల్తూరు: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కేపీపాలెం గ్రామంలోని బెల్లంకొండ వారి మెరకలో శనివారం జనసేన పార్టీకి చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ చీఫ్ విప్ ముదునూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చెన్ను సత్యనారాయణ, చెన్ను చిన్నరాయుడు, శ్రీను, చెన్ను రాంబాబు, చెన్ను గోపాలరావు, చెన్ను సీతారామయ్యతో పాటు వారి కుటుంబ సభ్యులు మరో 20 మంది వైస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు అందే భుజంగరావు, కటికల సూర్యారావు, కర్రి ఏసుబాబు, పోతుల రమేష, కొల్లాబత్తుల రవికుమార్ తదితరులు ఉన్నారు.



అత్తిలి: మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరిన జనసేన నాయకులు



మొగల్తూరు: కేపీపాలెంలో కండువా వేసి ఆహ్వానిస్తున్న చీఫ్ విప్ ముదునూరి



పెనుగొండ: మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరిన పెనుమంచిలి నేతలు



ఆకివీడు: ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం :

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు రోజురోజుకూ ఖాళీ అవుతున్నాయని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన రావి సుబ్బారావు, రావి రత్నరాజు, రావి దీపు, బాలం సుబ్బారావు, రావి శ్యామ్‌కుమార్, రావి గంగాధర్, రావి మధు, రావి రాజు, రావి రాకేష్, బాలం సుబ్బారావు, కేతా రాము, బాలం భానులను పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో గణేషుల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

ఆకివీడు: సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు మహిళలు, మహిళా కార్మికులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఆకివీడులోని 16వ వార్డులో ప్రచారం చేస్తుండగా 20 మంది మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు కౌన్సిలర్, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహంతో, ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పడాల కిషోర్‌రెడ్డి నేతృత్వంలో రైస్‌మిల్లు మహిళా కార్మికులు, మహిళలకు పీవీఎల్ పార్టీ కండువా వేసి స్వాగతించారు. పార్టీ విజయానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రిక్ బైక్ రూపొందించిన నిట్ విద్యార్థులు

రెండు గంటల చార్జింగ్‌తో 25 కిలోమీటర్లు



తాడేపల్లిగూడెం : రెండు గంటలు చార్జింగ్‌తో 25 కిలోమీటర్లు ప్రయాణించే ఓ ఎలక్ట్రిక్ బైక్‌ను ఏపీ నిట్ విద్యార్థులు రూపొందించారు. గంటకు 18 నుంచి 20 కిలో మీటర్ల వేగంతో ఈ బైక్‌పై ప్రయాణించవచ్చు. 150 నుంచి 200 కిలోల బరువును మోసుకుపోయే ఈ బైక్‌ను నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఎం.మనోజ్ నాయక్, ఎం. అనీషా, కె.ప్రత్యూష, కె.రాజేశ్వరి, కె.గణవర ప్రసాద్ 20 రోజులు శ్రమించి రూపొందించారు. కార్లు వంటి వాహనాలు వెళ్లని ప్రాంతాలలోకి, ఎక్కువ దూరం నడవలేని వృద్ధులకు ఈ బైక్ ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాక బైక్‌ను మడతపెట్టి తీసుకువెళ్లవచ్చు. రూ.20 వేలు వెచ్చించి ఈ బైక్‌ను తయారు చేశారు. విద్యార్థులకు ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయ శర్మ సలహాలు, సూచనలు ఇచ్చారు.

సమృద్ధిగా నీరు.. ఆశాజనకంగా దిగుబడులు

- రబీ సాగుకు వంతుల వారీగా పుష్కలంగా నీరు
- ఆలస్యంగా నాట్లు పడిన చోట్ల కోతలు ప్రారంభం
- మే 15 వరకు వరి మాసూళ్లు కొనసాగే అవకాశం



వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న నీరు



ఆకివీడులో ఏపుగా పెరిగిన రబీ వరి చేను

ఆకివీడు: గోదావరిలో సమృద్ధిగా నీటి లభ్యత ఉండటంతో ఈ ఏడాది రబీ సాగుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగునీరు అందింది. సాగు ప్రారంభం నుంచే జలవనరుల శాఖ సాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకుంది. వంతుల వారీ విధానాన్ని అమలుజేసి సాగునీటిని పొదుపుగా సరఫరా చేయడంతో శివారు ప్రాంతాలకు సైతం నీరు పుష్కలంగా అందింది. దీంతో రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తలేదు. రైతులు సాగు నీటిని ఒబ్బిడిగా వినియోగించుకోవడంతో పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలో రబీ సాగు ఈ ఏడాది 2.20 లక్షల ఎకరాల్లో జరిగింది. పశ్చిమ డెల్టాలోని పలు పంట కాల్వలకు వంతుల వారీగా 3 వేల వరకు క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అధికారికంగా పంట కాలువలను ఈ నెల 20న మూసివేయాల్సి ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఆలస్యం కావడంతో పలు మండలాల్లో వరి పంట వివిధ దశల్లో ఉంది. మెట్ట ప్రాంతంలో మాసూళ్లు వేగంగా జరుగుతుండగా, డెల్టా ప్రాంతంలో ప్రస్తుతం మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మే 15వ తేదీ దాటే వరకూ కోతలు కొనసాగుతాయి. దీంతో పంట కాల్వల్లో నీటి విడుదల మే నెల ఒకటో తేదీ వరకూ కొనసాగించే అవకాశం ఉంది.

చీడపీడలు తక్కువే

వంతుల వారీ నీటి విధానంతో పంట పొలాలకు సరిపడా నీరు అందడం, తడిపొడితో మొక్కలు ఏపుగా ఎదిగి, పిలకలు అధికంగా వేశాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనివల్ల కంకులు అధికంగా ఉండి దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ ఏడాది చీడపీడలు లేకపోవడంతో ఎరువులు, పురుగు మందులను రైతులు అంతంతమాత్రంగానే వినియోగించారని అంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 20 శాతం మాసూళ్లు పూర్తి కాగా, ఎకరాకు సరాసరి 50 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. పాలకోడేరు మండలంలో ఎకరాకు 60 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని చెబుతున్నారు. జిల్లాలో రబీ సాగులో అత్యధికంగా రైతులు ఎంటీయూ 1121 రకం వంగడం సాగు చేయగా, ఎంటీయూ 1153, పీఆర్ 126 తదితర వంగడాల్ని సాగు చేశారు. కొన్నిచోట్ల దేశవాళీ వంగడాల్ని కూడా సాగు చేసి మంచి ఫలితాల్ని పొందుతున్నారు.

సరాసరి 50 బస్తాల దిగుబడి



జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరిగింది. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో 60 బస్తాలకు పైబడి దిగుబడి వచ్చింది. జిల్లాలో ఇప్పటివరకు సరాసరి దిగుబడి 50 బస్తాలుగా ఉంది. ఎక్కడా 48 బస్తాలకు తక్కువ కాకుండా దిగుబడులున్నాయి. ఎంటీయూ 1121 సరాసరి 50 బస్తాలుండగా, పీఆర్ 126 వంగడం సాగుతో 65 నుంచి 70 బస్తాల దిగుబడి వచ్చింది.

– జెడ్.వెంకటేశ్వర్లు, జేడీఏ, పశ్చిమగోదావరి జిల్లా

జాతీయ పెంటాథ్లాన్ పోటీలకు ఇల్లిందలపర్రు విద్యార్థి



విద్యార్థి పృధ్వీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇరగవరం: జాతీయ స్థాయి పెంటాథ్లాన్ పోటీలకు కె.ఇల్లిందలపర్రు హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి ముప్పన పృధ్వీ ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ అండర్–17 బాలురు విభాగంలో లేజర్ రన్ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి మహారాష్ట్రలోని బందేరిలో జరిగే మోడరన్ పెంటాథ్లాన్ పోటీలో పాల్గొంటారని చెప్పారు. పృధ్వీని సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున పేరెంట్స్ కమిటీ చైర్మెన్ పిప్పళ్ళ వెంకట లక్ష్మి, గ్రామ సర్పంచ్ మట్టా నాగమణి, పీడీ కేవీఆర్ సుబ్బరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రచారంలో దూసుకెళుతున్న ఉమాబాల

- ప్రత్యర్థి కంటే ప్రచారంలో ముందంజలో ఉన్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల
- ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి దూకుడుగా ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలతో ప్రజలతో మమేకం



ఆత్మీయ సమావేశాలతో ప్రజలతో మమేకమవుతున్న ఉమాబాల



భీమవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉమాబాల

భీమవరం: వైఎస్సార్ సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని ఉమాబాల ఎన్నికల రణరంగంలో ప్రచారంలో రామబాణంలో దూసుకువెళుతున్నారు. ఓ వైపు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే మరో వైపు అన్నివర్గాల ప్రజలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. నరసాపురం పార్లమెంట్‌కు గతంలో ఎన్నడూలేని విధంగా బీసీ వర్గానికి చెందిన గూడూరి ఉమాబాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో తనదైనశైలిలో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓ విడత ప్రచారం చేశారు. భీమవరానికి చెందిన ఉమాబాల గతంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పనిచేయడంతో జిల్లాలో ఆమెను కొత్తగా పరిచేయాల్సిన అవసరం లేదు. మృదుస్వభావం కలిగిన ఆమె చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ మీ ఇంటి ఆడపడుచుకు ఒక్క అవకాశమివ్వండి అంటూ ప్రజలను కలుస్తుంటే ప్రత్యర్థి పార్టీ అభిమానులు కూడా ఆమెకు మద్దతు తెలుపుతున్నారంటే అతిశయోక్తికాదేమో. ఉమాబాల బీఎస్సీ, బీఎల్ గోల్డ్‌మెడలిస్టు. ఉన్నత విద్యనభ్యసించినప్పటికీ ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. అలాగే మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళ కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శిగా, ద్వారకాతిరుమల దేవస్థానం సభ్యురాలిగా, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా పార్టీ నాయకులకే గాకుండా జిల్లాలోని ప్రజలందరికీ సుపరిచితురాలే.

పార్టీ పార్లమెంట్ కన్వీనర్‌గా ఎన్నికై మరింత ఉత్సాహంగా..

ప్రతి నిత్యం ప్రజల్లో ఉండే ఉమాబాల వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్‌గా ప్రకటించిన నాటినుంచి అలుపెరుగక జనం మధ్యనే తిరుగుతూ ప్రచారంలో మరింత దూకుడు పెంచారు. వివిధ సామాజిక వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ తనదైన ముద్రవేసుకున్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూ వారితోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రధానంగా పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు కలిగిన శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం ఉమాబాలకు మరింత కలిసివచ్చే అంశంగా మారింది. కులసంఘ పెద్దలతో మమేకమవుతూ నరసాపురం పార్లమెంట్ చరిత్రలో మొట్టమొదటిసారిగా బీసీ మహిళకు వచ్చిన అవకాశానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలంటూ ఆత్మీయ సమావేశాల్లో ఆమె చేస్తున్న ప్రసంగం సంఘం సభ్యులను రాజకీయాలకు అతీతంగా పనిచేయాలనే నిర్ణయానికి వచ్చేలా చేసింది.

ప్రత్యర్థి బీజేపీ వెన్నులో వణుకు

బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎన్నో తర్జనభర్జనల తరువాత బీజేపీకి చెందిన భూపతిరాజు శ్రీనివాసవర్మను ప్రకటించారు. అయినప్పటికీ ఎంపీ అభ్యర్థిని మార్చాలంటూ కూటమిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు పట్టుబట్టడంతో శ్రీనివాసవర్మ నామినేషన్ వేసే వరకు అభ్యర్థిగా ఉంటారా అనే సందేహాలు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిలో వ్యక్తమయ్యాయి. ఎట్టకేలకు శ్రీనివాసవర్మను ఖరారు చేసినప్పటికీ కూటమి అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులను కలుపుకుని ముందుకు వెళ్లడానికి వర్మ ఎక్కువ సమయం కేటాయించాల్సిరావడంతో ప్రజలను కలిసే సమయం తగ్గిపోయింది. దీంతో అనేక ప్రాంతాల్లో కూటమీ ఎంపీ అభ్యర్థి ఎవరంటూ ప్రశ్నార్థకంగా మారింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉమాబాల ప్రచారంలో ముందంజలో ఉండడంతోపాటు ఆ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉండడంతో ఆమె అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తునే ధీమా ప్రజల్లో వ్యక్తమవుతోంది.

సంక్షేమం అందాలంటే జగనే రావాలి

తణుకు 5వ వార్డు ప్రచారంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు 5వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న గ్రంధి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

తణుకు అర్బన్: సంక్షేమ పథకాల లబ్ధి పారదర్శకంగా అందాలన్నా, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒకటో తేదీనే ఇంటి గుమ్మంలోకి పింఛను ఇవ్వాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 5, 2, 26 వార్డుల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. మీ బిడ్డ జగన్ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే పప్పుబెల్లాల్లా పంచి పెట్టేస్తున్నారని, రాష్ట్రం శ్రీలంక మాదిరిగా అయిపోతుందని చంద్రబాబు అండ్‌కో నెత్తినోరు బాదుకున్నారని, తీరా ఎన్నికలు వచ్చేసరికి జగన్ ఇస్తున్న సంక్షేమాన్ని మేము కూడా ఇస్తామంటూ బయలుదేరుతున్నారని విమర్శించారు. గతంలో 600 హామీలు అమలు చేస్తానని చెప్పి ఎగ్గొట్టిన చంద్రబాబును నిన్ను నమ్మం బాబూ అంటూ ఇంటికి పంపించారని, ఇప్పుడు మళ్లీ ఇదే సంక్షేమం అందిస్తానంటే నమ్మేవారు లేరని దుయ్యబట్టారు. 58 నెలల కాలంలో అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మల ఇంటి గుమ్మంలోకే వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛను అందిస్తే ఎన్నికల కోడ్ రాగానే నీ గుంటనక్కలతో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయించి ఇంటి గుమ్మంలోకి వచ్చే పింఛను పంపిణీని అడ్డుకుని అవ్వాతాతల ఆగ్రహానికి గురయ్యారన్నారు. వచ్చేనెల 13వ తేదీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చరమగీతం పాడటం ఖాయమన్నారు. ప్రజలకు మంచి చేశాడు కాబట్టే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర, సిద్ధం సభలకు విపరీతమైన ప్రజాదరణ వచ్చిందని స్పష్టం చేశారు. ఇది చూసి ఓర్వలేని చంద్రబాబు పచ్చమూకతో దాడులకు పాల్పడం కూడా ప్రజలు గమనించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్, మంగెన సూర్య, నూకల కనకదుర్గ, వంటెద్దు ఈశ్వరప్రసాద్, 5వ వార్డు ఇన్‌చార్జ్ సుద్దుల పాండు, కారుమంచి మిత్ర, తణుకు సత్యనారాయణ, గోరీనాయుడు, పీర్ సాహెబ్, ఆంజనేయులు, మల్లిపూడి నాగమణి, 2వ వార్డు నాయకులు సందాపు దుర్గారావు, 26వ వార్డు నాయకులు మారిశెట్టి శేషగిరి, గారపాటి సత్యనారాయణ, యడ్లపల్లి సురేంద్ర, పొట్ల సురేష్, సామంతుల అప్పారావు, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్) : అన్ని వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం భీమవరం టూటౌన్‌లోని 32, 33, 34, 35 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా అమలు చేసి నేడు తన ప్రభుత్వంలో మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ధైర్యంగా ప్రజలను అడుగుతున్నారని అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో నవరత్న పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికీ అందించి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు వారికి లబ్ధి అందించారన్నారు. అవినీతి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ పథకాల నగదును జమ చేశారన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానని, కరోనాలో సైతం బాధితులకు సేవలు అందించామన్నారు. భీమవరం పట్టణాన్ని, వీరవాసరం, భీమవరం మండల పరిధిలోని గ్రామాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. వచ్చే ఎన్నికలలో మరోసారి తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, గ్రంధి బాలాజీ, పార్టీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, రెండో పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఏఎస్ రాజు, ముత్యాల బుజ్జి, కొప్పర్తి జనార్దన్, బొర్రా వాసు, పిప్పల నాని, కైలా పాండురంగారావు, గాదిరాజు రామరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, చెన్ను చంటి, తాళ్లపూడి పరమేశ్వరరావు, రేవూరి గోగురాజు, అభిరుచి రఘు, కాంట్రాక్టర్ సుబ్బరాజు పాల్గొన్నారు,

రైల్వేస్టేషన్‌లో 29 కిలోల గంజాయి పట్టివేత

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ సీఐ బి.శంకరరావు చెప్పారు. విజయవాడ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే డీఎస్పీ డీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్–3లో బ్యాగులను తనిఖీ చేస్తుండగా భారీగా గంజాయిని గుర్తించారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా ప్రాంతానికి చెందిన షాఫీర్ సైపుద్దీన్, మహారాష్ట్ర షోలాపూర్ ప్రాంతానికి చెందిన శశికళ రమేష్ లకండే అనే ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 29 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

గణపవరం: గణపవరంలో శనివారం ఎఫ్ఎస్‌టీ తనిఖీ బృందం చేసిన తనిఖీల్లో రూ.1.54 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెంటపాడు మండలం విప్పర్రుకు చెందిన గంగారామచంద్ర నుంచి రూ.70 వేలు, మండలపర్రుకు చెందిన చిరతపూడి వెంకటరామకృష్ణ నుంచి రూ.84,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో రూ.1,27,500 నగదును పట్టుకున్నట్లు ఆర్వో ఖాజావలిలలి చెప్పారు. ఎఫ్ఎస్‌టీ టీమ్–1 సభ్యులు శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఎంవీఎల్ బాజ్జి నుంచి రూ.70 వేల నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్–2 సభ్యులు తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న బొప్పన శరత్‌బాబు వద్ద నుంచి రూ.57,500 నగదు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

వేల్పుచర్లలో చోరీ

ముసునూరు: వేల్పుచర్లలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేల్పుచర్లలో పోలగాని రవి గురువారం ఇంటి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లారు. శనివారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం బద్దలుకొట్టి ఇంట్లో ఉన్న రూ.50వేల విలువైన బంగారం, బైక్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తుందుర్రులో దొంగల హల్‌చల్



తుందుర్రులో దొంగలను పోలీసులకు అప్పగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: తుందుర్రులో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నలుగురు దొంగలు గ్రామంలోని రామాలయం వీధిలోకి ఓ దొంగ ఒక వ్యక్తి ఇంట్లో చొరబడి ఒక ద్విచక్ర వాహనం తాళం తీసేందుకు ప్రయత్నించగా, మరోదొంగ బీరువా తాళాలు బద్దలు కొట్టేందుకు విఫలయత్నం చేశారు. ఈ అలికిడికి నిద్రిస్తున్న యజమాని మేల్కొని కేకలు వేయగా పారిపోయేందుకు ప్రయత్నించిన దొంగలను వెంబడించారు. అదే సమయంలో రామాలయం వద్ద కమిటీ సభ్యులు శ్రీరామ ఉత్సవ లెక్కలు చూస్తున్న కొందరు గ్రామస్తులు సాహసించి ఇద్దరు దొంగలను పట్టుకుని చెట్టుకు కట్టివేశారు. పట్టుబడిన దొంగలు మందు, గంజాయి మత్తులో జోగుతూ గ్రామస్తులపై తిరగబడే ప్రయత్నం చేశారు. భీమవరంలో తిరగారా అంటూ గ్రామస్తులను బెదిరించారు. గ్రామస్తులు నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పట్టుబడిన దొంగలు వద్ద నుంచి మోటార్ సైకిలు, ల్యాబ్‌టాబ్, కటింగ్ ప్లేయర్, బ్లేజులు స్వాధీనం చేసుకున్నారు.

సీఐ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లకు రిమాండ్

అవినీతి కేసు విచారణ చేస్తున్న ఏసీబీ

ఏలూరు టౌన్ : ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తూ ఏసీబీకి చిక్కిన వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు రాజేంద్ర, ఇస్సాక్‌ను ఏసీబీ అధికారులు శనివారం రాజమహేంద్రవరంలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనంతరం వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో సీఐ వెంకటేశ్వరరావు ఇంట్లోనూ ఏసీబీ అధికారులు శనివారం రాత్రి వరకు తనిఖీ చేశారు. కొంత నగదు, బంగారం, విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో కొన్ని బుల్లెట్లు లభ్యం కాగా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఏసీబీ డీఎస్పీ వీ.సుబ్బరాజును వివరణ కోరగా సీఐ ఇంట్లో తనిఖీలు చేశామని బంగారం, ఆస్తి పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువను అంచనా వేయాల్సి ఉందన్నారు.

త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసరావు

ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐగా కే శ్రీనివాసరావును పోలీసు ఉన్నతాధికారులు శనివారం రాత్రి నియమించారు. ఇక్కడ సీఐ వెంకటేశ్వరరావు అవినీతి కేసులో పట్టుబడటంతో ఇన్‌చార్జిగా ఏలూరు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రాజరాజేశ్వరి అలంకరణలో రాట్నాలమ్మ

ముగిసిన రాట్నాలమ్మ తిరునాళ్ల



రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిస్తున్న రాట్నాలమ్మవారు

పెదవేగి : రాట్నాలకుంటలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లు శనివారం ముగిశాయి. ఆఖరి రోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరునాళ్లలో భాగంగా విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపార్చన, పరిసర దేవతార్చన, కుంకుమార్చనలు, శ్రీరామలింగేశ్వర స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. అనంతరం మహానివేదన, దీక్షావిరమణ, ఆశీర్వచనం అందించారు. రాయన్నపాలెంకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన సమాజం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పూలరంగడు సాంఘిక పద్యనాటకం భక్తులను అలరించింది.

ఆర్థికంగా బలోపేతం చేశారు



పేదింటి కాపు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 58 నెలల కాలంలో అమలు చేసిన వైఎస్సార్ కాపు నేస్తం పథకం కాపులు స్వాగతించారు. ఇప్పుడు ఆ పథకం ద్వారా కాపు మహిళలకు మరింత అండగా నిలబడేలా రూ. 60వేలు మొత్తాన్ని రెట్టింపు చేస్తూ మేనిఫెస్టోలో రూ.1.20 లక్షలకు పెంచడాన్ని కాపులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వంటిద్దు ఈశ్వరప్రసాద్, తణుకు పట్టణ కాపు సంఘ అధ్యక్షుడు

పేదల మేనిఫెస్టో



పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించి అమలు చేసిన మేనిఫెస్టో ఎంతో ఆదరణ పొందింది. ఇప్పుడు అదే సంక్షేమ పథకాలను రెట్టింపు మొత్తాన్ని ప్రకటించడమే కాకుండా డ్రైవర్స్‌కు ప్రమాద బీమాతో పాటు జగనన్న తోడు పేరుతో చిరు వ్యాపారులకు రూ. 15వేలకు పెంచడం మంచి పరిణామం.

– ఎండీ హబీబుద్దీన్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, అత్తిలి

జగన్ చెప్పింది చేస్తారు



ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తే, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల మనన్నలను జగన్‌మోహన్‌రెడ్డి పొందారు. చంద్రబాబు ప్రకటించే మేనిఫెస్టోను ప్రజల నమ్మే పరిస్థితిలో లేరు. చంద్రబాబు చెప్పింది చేయడని, జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తారని ప్రజలు నమ్ముతున్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికే మా ఓటు.

– మర్రి అరుణ, తాడేపల్లిగూడెం.

వైఎస్సార్ చేయూత రెట్టింపు



వైఎస్సార్ చేయూత పథకం మొత్తాన్ని రెట్టింపు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. జగన్‌పై మాకు నమ్మకం ఉంది. మరింత సంక్షేమం అందిస్తాడు. 30 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాము. పట్టాలు ఇవ్వడం కొట్టు సత్యనారాయణ వల్లే సాధ్యమైంది.

– సందగ నాగమణి, 16వ వార్డు తాడేపల్లిగూడెం.

క్లుప్తంగా

కోపల్లె శ్రీనివాస్‌కు అభినందనలు



డాక్టరేట్ అందుకుంటున్న కోపల్లె శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ రంగస్థల కళాకారులు, సాహితీ సామాజిక సేవా తత్పరులూ కోపల్లె శ్రీనివాస్‌కు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ వారిచే తమిళనాడులోని ఊటీలో పీస్ కౌన్సిల్ ఎచీవర్స్ అవార్డు, డాక్టరేట్ ప్రదానం చేశారు. కోపల్లె 134 రకాల పాత్రలు, వేలాది రంగస్థల ప్రదర్శనలు వివిధ సంస్థలచే పలు అవార్డులు, రివార్డులు, బిరుదులు అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న కోపల్లెను కళాకారులు, సామాజిక సంస్థలు, అసోసియేషన్ సభ్యులు అభినందనలు చెప్పారు.

విధుల్లో అలసత్వం వద్దు



తణుకు ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

తణుకు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎవరూ విధుల్లో అలసత్వం వహించవద్దని విజయవాడ డిప్యూటీ కమిషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎం శంకరయ్య అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కమీషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎం రవిప్రకాష్ ఉత్తర్వుల మేరకు డిప్యూటీ కమిషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎం శంకరయ్య శనివారం తణుకు ఎస్ఈబీ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం నిల్వలపై నిఘాపెట్టాలని, పట్టుకున్న కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్ రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రక్షణ స్వర్ణ మహోత్సవాలు

పెంటపాడు: ఈనెల 24 నుంచి గూడెం కొండాయి చెరువు సమీపంలో ఫెయిత్ చర్చి ఆవరణలో 50వ వార్షిక రక్షణ స్వర్ణ మహోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ముగింపు పురస్కరించుకొని విశాఖపట్నంకు చెందిన జెఫన్యాశాస్త్రి దేవుని వాక్యం బోధించారు.అపవాది కుతంత్రాలకు లోబడకుండా విశ్వాసులు ఆధ్యాత్మిక జీవనాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలలో దైవసేవకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన బిషప్ డాక్టర్ జి. రూత్, రక్షణానందం, అనంతపురం గుత్తికి చెందిన బైబిలుమిషను నాయకులు బి. మణి అద్భుత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమవరం: పట్టణంలోని భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి మజ్జిగ, మంచి నీటి చలివేంద్రాన్ని శనివారం భీమవరం డీఎస్పీ వి నారాయణస్వామిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా సంస్థలు, దాతల సహకారంతో వివిధ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ఎస్ఐ ఎం. వెంకటేశ్వరరావు, సేవాసంస్థ కన్వీనర్ అల్లు శ్రీనివాస్, మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధరాజు వెంకటపతి రాజు, కారుమూరి నర్సింహమూర్తి (బాబు), సర్వోదయ మండలి కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, కలిగొట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు

భీమవరం: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ జూన్ 7వ తేదీ వరకు నిర్వహించే ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలి

నరసాపురం రూరల్: తాగునీటి వాడకం, పశువుల చెరువులను అన్నింటినీ పూర్తి స్థాయిలో నింపుకోవాలని నీటిపారుదల శాఖ డీఈ సీహెచ్‌వీవీఎస్ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పంట చేలకు పూర్తిస్థాయిలో నీరు అందించామన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నందున చెరువులన్నింటినీ పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆయన సూచించారు.

పేదల ముంగిటకే ప్రభుత్వ పథకాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారాలు



పరిమెళ్ల గ్రామంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



మంత్రి కొట్టు సత్యనారాయణకు హారతులు ఇస్తున్న మహిళలు

పెంటపాడు: సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రజల గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం పెంటపాడు మండలంలోని పరిమెళ్ల, యానాలపల్లి, కె. పెంటపాడు గ్రామాల్లో కొట్టు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఆక్వా బోర్డు ఉపాధ్యక్షుడు వడ్డి రఘురాం, మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరావులతో కలసి ఆయన పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు జగనన్న మేలు చేసారన్న సంగతి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఒక్క రూపాయి కూడా లంచానికి పాల్పడకుండా అవినీతి లేని పాలన జగనన్న అందజేశారన్నారు. సంక్షేమ పాలన జగనన్నకే సొంతమన్నారు.

చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు

ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు , నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు వేసి తప్పక గెలిపించాలన్నారు. తద్వారా పేదలకు అనుకూలంగా ఉన్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకొందామన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలు గెలవడం ఖాయమన్నారు. ప్రతిపక్షాల కూటమికి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. పలు గ్రామాల్లో కూడళ్లలో ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు మహిళలు హారతులు ఇచ్చారు. యువత రోడ్ షోలు నిర్వహించారు. పసల కనకసుందరావు, వడ్డి రఘురాంలు మాట్లాడుతూ అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యసురక్ష, సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, పలు ఉద్యోగాలు కల్పించిన జగనన్నకే ప్రజల మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మల నాని, గుండుమోగుల సాంబయ్య, బండారు నాగు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యురాలు, ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, బూరాడ శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, రెడ్డి సూరిబాబు, యూత్ నాయకులు కొవ్వూరి భాస్కరరెడ్డి, కొలనువాడ అన్నవరం(దత్తుడు), తాడేపల్లి ప్రేమ్‌కుమార్, మిరియాల శేషు, ఉండ్రాజవరపు రాజు, బర్ల జయరాంబాబు, సర్పంచ్‌లు గొర్రెల కోటేష్, దాసం వెంకటేశ్వర్లు, భావన ధాన్యలక్ష్మి, మండా రామకృష్ణ, దొంకా రామకృష్ణ, దాసి బాబు, గోకా వెంకటేశ్వరరావు, మేడపురెడ్డి బొమ్మినాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ చోడగిరి చినబాబు, పెన్నాడ సూరిబాబు, పెన్నాడ రాఘవ, వాకా సుబ్బారావు, దానయ్య, నరాలశెట్టి సోమేశ్వరరావు ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, ఉండ్రాజవరపు రాజు, కోట రాంబాబు, మార్లపూడి రాము, మిరియాల భాస్కరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొణతాల వెంకట్రావు పాల్గొన్నారు.

సీఎం జగన్ మేనిఫెస్టోపై హర్షం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం రూపొందించిన మేనిఫెస్టోను మాలమహానాడు స్వాగతిస్తుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తణుకులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రజల కష్టాలను నేరుగా చూసి 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన పేదల మేనిఫెస్టో పేదలకు ఆర్థికంగా అండగా ఉందని, అదే సంక్షేమ పథకాల లబ్ధిని రెట్టింపు చేస్తూ ప్రకటించిన నేటి మేనిఫెస్టో పేదల మేనిఫెస్టోగా అభివర్ణించవచ్చన్నారు. చంద్రబాబు ఎన్ని బూటకపు మాటలు చెప్పినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు టి.శివ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రామారావు, రాష్ట్ర నాయకులు బి.సునీల్‌బాబు, సీహెచ్ గోపి, కిరణ్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



తూర్పువిప్పర్రు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి



అత్తిలిలో ఉమర్ ఆలీషా పీఠంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి, కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. శనివారం ఇరగవరం మండలంలోని తూర్పు విప్పర్రు, సూరంపూడి, కె ఇల్లిందలపర్రు, గోటేరు, అంతెనగుంట, గ్రామాల్లోని ఎస్సీ, శెట్టిబలిజ, ఒసీ ఏరియాల్లో ఆత్మీయ సమావేశం, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రేలంగి గ్రామంలో శెట్టి బలిజ, గౌడ కులస్తుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు తూర్పు విప్పర్రులో డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందజేశామన్నారు. చంద్రబాబు మాయ మాటాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, తూర్పు విప్పర్రు, కె ఇల్లిందలపర్రు సొసైటి అధ్యక్షుడు సైపురెడ్డి పెద్దిరాజు, మల్లి రెడ్డి నాగార్జున, లెనిన్, కటారి రాంబాబు వీరాస్వామి, బొల్లా రాము, బొల్లా సత్యనారాయణ, ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు, బీసీ చైతన్య వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా పీఠాన్ని సందర్శించిన మంత్రి కారుమూరి

అత్తిలి: విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ద్వారా, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం అత్తిలి ఉమర్ ఆలీషా ఆశ్రమాన్ని మంత్రి సందర్శించి పీఠం సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమర్ ఆలీషా ఆశీస్సులతో ప్రజలకు మంచి చేసే అవకాశం నాకు కలిగిందని, పీఠం అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మీరంతా అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో ఉమర్ ఆలీషాను మంత్రి దర్శించుకున్నారు. పీఠం కన్వీనర్ యర్రంశెట్టి పుల్లారావు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీకోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కూనపరెడ్డి జయరాజు, రామిశెట్టి రాము, సబ్బితి రాజేష్, మద్దాల బాపిరాజు, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి



వినతిపత్రంతో మృతుని కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, వెంకట కృష్ణాపురం గ్రామానికి చెందిన పంతుల చింతలయ్య జీవనోపాధి నిమిత్తం మలేషియా దేశానికి వెళ్లగా అక్కడ అనారోగ్యంతో మృతి చెందారు. అక్కడ యజమానులు నగదు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇండియాకు పంపుతామని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో ఆర్థిక పరిస్థితి బాగోలేని కుటుంబ సభ్యులు, తమ్ముడు పంతులు రమేష్ శనివారం లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావును కలిసి భౌతికకాయాన్ని ఇండియాకు తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు. మృతదేహాన్ని ఇండియాకు రప్పిస్తానని గట్టిం మాణిక్యాలరావు హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత



ఆస్పత్రిలో బిల్లు చెల్లిస్తున్న చెన్నా జనార్ధనరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అత్తిలికి చెందిన ఫ్లవర్ డెకరేషన్ కార్మికుడు రౌతు చంద్ర మణికంఠ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మణికంఠకు వైద్యం నిమిత్తం రోజుకు సుమారు 20 నుంచి 25 వేలు ఖర్చు కావడంతో కుటుంబ సభ్యులు గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్‌కు సాయం కోసం విజ్ఞప్తి చేశారు. దాతలు సహాయ సహకారాలతో గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఫౌండర్ త్రి కళ ఆధ్వర్యంలో వైద్యం నిమిత్తం రూ 30,500 అందజేశారు. ట్రస్టీ చెన్నా జనార్ధనరావు శనివారం ఆస్పత్రికి వెళ్లి సేకరించిన మొత్తాన్ని అందజేశారు. ట్రస్టీ చెన్నా జనార్ధనరావు మాట్లాడుతూ మరింత మంది దాతలు ముందుకు వచ్చి మణికంఠకు ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ పాలనకు అన్ని వర్గాల ఆదరణ

- చంద్రబాబు మాటలను నమ్మొద్దు
- గ్రామాల్లో ఉత్సాహంగా నాయకుల ప్రచారాలు



అత్తిలి: పడవల వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



తణుకు టౌన్: తేతలిలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



తాడేపల్లిగూడెం అర్బన్: 33వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు బాలరాజేష్



తణుకు టౌన్: వెంకట్రాయపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగేంద్ర బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు

అత్తిలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శనివారం అత్తిలి శివారు పడవలరేవు, రజకవీధిలో రాష్ట్రమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అల్లుడు దిలీప్‌కుమార్, మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్‌లో కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ ప్రకటిస్తున్న ఆచరణ సాధ్యంకాని మోసపూరిత పథకాలను నమ్మవద్దన్నారు. నవరత్నాల పథకాలకు అదనంగా మరికొన్ని పథకాలను జోడించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమపాలనకు సుగమం ఏర్పడుతుందన్నారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తణుకు ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని పైబోయిన కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్,జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, మండలపార్టీ నాయకులు గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, తమ్మాబత్తుల రాము, కంకటాల సతీష్, యడ్లపల్లి మణికుమార్, రావూరి సత్యనారాయణ, రంభ రాంబాబు, రామిశెట్టి రాము, పైబోయిన శ్రీను, బుద్దరాతి దొరబాబు, బుడితి సుజన్‌కుమార్, పి సంపదరావు, ఆకుల చిన బాబు, కుక్కల వెంకటరమణ, కాసగాని చిన్నా, దాసరి శ్రీను, సైపు సుబ్బయ్య, దుడే ఉమ, ప్రానిష్ , కూసంపూడి చంద్రరావు, తీర్థాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

తణుకు టౌన్: సంక్షేమ సారథి సీఎం జగన్ అని తేతలి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు తెలిపారు. తేతలిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిపెస్టోను ఓటర్లకు వివరించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు కోట స్వామీజీ, దారం శ్రీను, భూపతిరాజు రామకృష్ణంరాజు, వలవల కిషోర్, దొంగ బీమచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రాయపురంలో...

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిపించాలని కోరుతూ తణుకు నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగేంద్రబాబు కోరారు. శనివారం రాత్రి తణుకు రూరల్ మండలం వెంకట్రాయపురంలో మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తణుకు అసెంబ్లీ అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లువేసి గెలిపిచించాలని కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ ఉపాధ్యక్షుడు సిద్దెల పాండు, పట్టణ యూత్ అధ్యక్షుడు చేసెట్టి చిన్ని, పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు వంటిద్దు ఈశ్వర ప్రసాద్, వార్డు నాయకులు యల్లమిల్లి రమేష్‌బాబు, తాతపూడి వరప్రసాద్, ఉమ్మిడ సింగ్ శ్రీను, కట్టా కిషోర్, రేలంగి రాంబాబు, బూత్ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పెనుమాక అశోక్, మండల కోఆప్షన్ సభ్యుడు కె జస్పాల్, యూత్ అధ్యక్షుడు చెట్టే సునీల్, పంచాయితీ సభ్యులు మాండ్రు శ్రీకాంత్ కుమార్, సిర్రా జాన్, సిర్రా రాజేంద్ర, అద్దంకి వెంకన్న, కోటి రాం పండు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సీఎం జగనన్నతోనే సాధ్యమని కొట్టు తనయుడు కొట్టు బాలరాజేష్ తెలిపారు. స్థానిక 33వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సంక్షేమాన్ని కోరుకొనే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి రాష్ట్రంలో జగన్‌ను, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించాలన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు శాంతిభద్రతలతో, ప్రశాంతమైన జీవనం సాగించాలంటే ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచన ప్రజలను కోరారు. శనివారం 33వవార్డులో ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తాళ్ళూరి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ లేకుండానే పనులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండానే జరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. శనివారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ పనుల వద్దకు రాకపోగా తన బంధువులకు కొన్నిమస్తర్లు వేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధ్యత కలిగిన వారిని నియమించాలని అధికారులను కోరారు. కూలి రూ.600లు చెల్లించాలని, కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలని నినాదాలు చేశారు. ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయాలనుకోవడం అన్యాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయాలనుకోవడం అన్యాయమని జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి ఎస్కే నౌషాద్ మోహిద్దీన్ పేర్కొన్నారు. ఏపీ రాష్ట్రంలో అమలు అవుతున్న నాలుగు శాతం ముస్లింల్లో వెనుకబడిపోయిన వర్గాలకు ఇస్తున్న రిజర్వేషన్లును ఎన్డీఏ కూటమి నాయకులు రద్దు చేస్తామని, బహిరంగ సభలో చేస్తున్న ప్రకటనలను మోహిద్దీన్ ఖండించారు. కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు బీజేపీ వైఖరిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీతో కుమ్మక్కై న పార్టీలు ముస్లింలకు అన్యాయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ముస్లింలు బాగా ఆలోచించి మే నెలలో జరుగుతున్న ఎన్నికలలో బీజేపీతో కుమ్మక్కయిన పార్టీలకు సరైన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో ముస్లిం పెద్దలు మహబూబ్ బాషా, ఎండీ రఫీ, ఆటోవలీ, బాబర్, షేక్‌వలి తదితరులున్నారు.